'కోడ్' ఏం చెబుతోంది..



రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ ఉల్లంఘిస్తే ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చు. సీ–విజిల్ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోలు పంపించవచ్చు. 10లో▸



పాఠశాలలో పారిశుధ్య లోపం!

వాంకిడి మండల కేంద్రంలోని జెడ్పీ ఎస్ఎస్‌లో పారిశుధ్యం లోపిస్తుంది. పాఠశాల ఎదుట నిర్మించాల్సిన డ్రైయినేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 11లో▸

గరిష్టం/కనిష్టం
32.5/18.9

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు స్వలంగా తగ్గుతాయి. పొగ మంచు ప్రభావం కనిపిస్తుంది. పగటి పూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాం

బెజ్జూర్(సిర్పూర్): ఆస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి తుకారాం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. ప్రతీ వారం వైద్యసిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయాలని వైద్యాధికారిని ఆదేశించారు. ఆస్పత్రి గ్రేడ్ పెరిగినప్పటికీ సరిపడా సిబ్బంది లేక ఎదురవుతున్న ఇబ్బందులుపై ఆరా తీశారు. వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మారుమూల మండలంలో విధులు నిర్వర్తించేందుకు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డాక్టర్ అవినాష్, ఫార్మసిస్ట్ ఆయేషా, ల్యాబ్ టెక్నీషియన్ దిలీప్, సిబ్బంది ఉన్నారు.

'మాలీలను ఎస్టీ జాబితాలో కలపాలి'



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుర్నులె నారాయణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 22 ఏళ్లుగా మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో ఉద్యమిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఉద్యమాన్ని గుర్తించి గిరిజన రిజర్వేషన్‌ను 10శాతానికి పెంచుతూ, అదే సమయంలో మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో కలుపుతూ తీర్మానించారని తెలిపారు. తెలంగాణలో ప్రత్యేక జీవో ద్వారా మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. అలాగే మాలీలు సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో కమ్యూనిటీ భవన నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరారు. మాలి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని మేనిఫెస్టోలో చేర్చితేనే ఆ రాజకీయ పార్టీకి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నగోశె శంకర్, నాయకులు బాబురావు, తిరుపతి, తులసీరాం, గౌరయ్య, శివరాం, నాగేష్, జైరాం తదితరులు పాల్గొన్నారు.

'సిర్పూర్ ప్రజలకు అండగా ఉంటా'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

సిర్పూర్(టి): అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని, సిర్పూర్ ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రంలోని జీషాన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్, బీజేపీల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు అనేక సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం సిర్పూర్(టి) మండలంలోని ఎంపీటీసీ సోహెల్ అహ్మద్, మాజీ ఎంపీపీ రైస్ అహ్మద్, నాయకులు దుర్గం తులసీరాంతో పాటు వందమంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఎమ్మెల్యే కోనప్ప ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ, నాయకులు కిజర్‌హుస్సేన్, యాదగిరి బ్రహ్మయ్య, మహేందర్ నాయక్, చౌదరి నానాజీ, ప్రేంసాగర్ గౌడ్, దస్తగిరి, బొమ్మెన శ్రీనివాస్, తోట మహేశ్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

పోరుబిడ్డల పురిటిగడ్డ!




- గోండు రాజులు పాలించిన ప్రాంతం
- గోండు బెబ్బులి కుమురంభీం నడిచిన నేల
- నిజాం కాలం నుంచి 'ఆసిఫాబాద్' ప్రత్యేకం
- ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఇక్కడి వారే..
- 1952 నుంచి 15 సార్లు ఈ నియోజకవర్గానికి ఎన్నికలు

జంగ్ తెలంగాణ

సాక్షి, ఆసిఫాబాద్/ఆసిఫాబాద్: స్వాతంత్య్రం తర్వాత 1952లో ఆవిర్భవించిన ఆసిఫాబాద్ నియోజకవర్గానికి గోండు రాజుల కాలం నుంచి చారిత్రక నేపథ్యం ఉంది. నిజాం కాలంలో ఈ ప్రాంతాన్ని జనగామగా పిలిచేవారు. హైదరాబాద్ సంస్థానాధీశుడిగా ఉన్న నిజాం నవాబు 1907లో ఆసిఫాబాద్‌గా నామకరణం చేశారు. రెబ్బెనలో ఉన్న రైల్వే స్టేషన్‌ను ఆసిఫాబాద్ రోడ్‌గా మార్చారు. నిజాం కాలంలో పరిపాలనా సౌలభ్యం కోసం 1913 నుంచి 1940 వరకు ఇది జిల్లా కేంద్రంగా ఉండేది. ఆ తర్వాత జిల్లా కేంద్రం ఆదిలాబాద్ తరలిపోయినా ఆసిఫాబాద్ మాత్రం తన విశిష్టతను కాపాడుకుంటూ వస్తోంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత మళ్లీ జిల్లా కేంద్రంగా మారింది. ఆసిఫాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మొన్నటి వరకు నిజాం కాలం భవనంలోనే కొనసాగింది. నిజాం ప్రభుత్వం రాష్ట్రంలోనే మొట్టమొదటి ఆర్టీసీ డిపోను ఇక్కడే ఏర్పాటు చేసింది.

1952లో ఆవిర్భావం

జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలు రెండూ 1952లోనే ఆవిర్భవించాయి. ఆసిఫాబాద్ అసెంబ్లీకి 15 సార్లు ఎన్నికలు జరగగా తొమ్మిది మంది ప్రాతినిధ్యం వహించారు. 1952లో ఆసిఫాబాద్, 1957లో సిర్పూర్ నియోజకవర్గాలు ద్విసభ్య నియోజకవర్గాలుగా ఉండేవి. అప్పట్లో ఓటర్లు ఇద్దరేసి ఎమ్మెల్యేలను ఎన్నుకున్నారు. సిర్పూర్ నుంచి కాంగ్రెస్ తరఫున జి.వెంకటస్వామి, ప్రజా సోషలిస్ట్ పార్టీ తరఫున కె.రాజమల్లు ఎమ్మెల్యేలుగా ఉండగా, ఆసిఫాబాద్ ద్విసభ్య నియోజకవర్గానికి కాంగ్రెస్ తరఫున గాంగ్వీ కాశీరాం, కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాతినిధ్యం వహించారు. మళ్లీ 1962లో జనరల్‌గా మారాయి. ఆసిఫాబాద్‌లో ఆరంభం నుంచి 1978 వరకు కాంగ్రెస్ ప్రభంజనం కొనసాగింది. తర్వాత 1983లో రాష్ట్రమంతటా తెలుగుదేశం గాలి వీచినా ఇక్కడ మాత్రం 1983, 1985లో సీపీఐ అభ్యర్థి గుండా మల్లేశ్ వరుసగా విజయం సాధించడం గమనార్హం. అలాగే కాంగ్రెస్ తరఫున 1962, 1967, 1972 బరిలో నిలిచిన కోట్నాక భీంరావు హ్యాట్రిక్ సాధించారు. ఆయన మంత్రి కూడా పనిచేశారు. కాగా 1952 నుంచి 1978 వరకు ఇది ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంగానే ఉంది. పునర్విభజనలో ఖానాపూర్ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు కలిశాయి. 1978 నుంచి 2004 వరకు ఆరుసార్లు ఎస్సీలకు రిజర్వ్‌డ్ అయింది. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో మారిన హద్దులతో తిరిగి ఎస్టీ రిజర్వ్‌డ్‌గా మారింది.



కొండా లక్ష్మణ్ బాపూజీ



కోట్నాక భీంరావు



దాసరి నర్సయ్య



గుండా మల్లేశ్



కోవ లక్ష్మి



ఆత్రం సక్కు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ
1952 (ద్విసభ్య)	గాంగ్వీ కాశీరాం కొండా లక్ష్మణ్ బాపూజీ	కాంగ్రెస్ కాంగ్రెస్
1957	జి.నారాయణరెడ్డి	కాంగ్రెస్
1962	కోట్నాక భీంరావు	కాంగ్రెస్
1967	కోట్నాక భీంరావు	కాంగ్రెస్
1972	కోట్నాక భీంరావు	కాంగ్రెస్
1978	దాసరి నర్సయ్య	కాంగ్రెస్
1983	గుండా మల్లేశ్	సీపీఐ
1985	గుండా మల్లేశ్	సీపీఐ
1989	దాసరి నర్సయ్య	కాంగ్రెస్
1994	గుండా మల్లేశ్	సీపీఐ
1999	డాక్టర్ పాటి సుభద్ర	టీడీపీ
2004	అమురాజుల శ్రీదేవి	టీడీపీ
2009	ఆత్రం సక్కు	కాంగ్రెస్
2014	కోవ లక్ష్మి	టీఆర్ఎస్
2018	ఆత్రం సక్కు	కాంగ్రెస్

నియోజకవర్గ ప్రత్యేకతలు

జల్ జంగల్ జమీన్, ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన గోండు వీరుడు కుమురంభీం వర్ధంతిని ఏటా ప్రభుత్వం కెరమెరి మండలం జోడేఘాట్‌లో అధికారికంగా నిర్వహిస్తోంది. ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఈ నియోజకవర్గం నుంచే ఎన్నికయ్యారు. రాష్ట్రంలో మొదటి గిరిజన పట్టభద్రుడు కొట్నాక భీంరావు ఇక్కడి వారే కావడం విశేషం. నిజాం మెచ్చిన గ్రామంగా ఆసిఫాబాద్ పేరొందింది. జైనూర్ మండలం మార్లవాయిలో ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ దంపతుల సమాధులు ఉన్నాయి. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు పూలాజీ బాబా క్షేత్రం కూడా ఈ నియోజకవర్గంలో ఉంది. పట్టణంలోని షిర్డీసాయి మందిరం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. కుమురంభీం, వట్టివాగు, చెలిమెల వాగు ప్రాజెక్టులు ఉన్నాయి. రికార్డు స్థాయిలో పత్తి పండుతుండటంతో జిన్నింగు, ఆయిల్ మిల్లులు వెలిశాయి. ఈ ప్రాంతాన్ని సుమారు 200 ఏళ్లు గోండు రాజులు పరిపాలించినట్లు చరిత్ర చెబుతోంది.

మొత్తం పది మండలాలు..

ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఆదిలాబాద్ లోకసభ పరిధిలోకి వస్తుంది. ఆసిఫాబాద్ పాత నియోజకవర్గం(ఎస్సీ- 244)లో ఆసిఫాబాద్, బెల్లంపల్లి, తాండూర్, రెబ్బెన, తిర్యాణి, వాంకిడి, భీమిని మండలాలు ఉండేవి. పునర్విభజన తర్వాత బెల్లంపల్లి, తాండూరు, భీమిని మండలాలతో బెల్లంపల్లి నియోజకవర్గం ఏర్పడింది. ప్రస్తుతమున్న ఆసిఫాబాద్(ఎస్టీ- 005) నియోజకవర్గంలో ఆదిలాబాద్ జిల్లాలోని రెండు మండలాలు(నార్నూర్, గాదిగూడ)తో కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, వాంకిడి, ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి మండలాలు ఉన్నాయి. తొలుత ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్న సమయంలో.. ఆ తర్వాత కూడా ఇక్కడ కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. 1957లో జి.నారాయణరెడ్డి, 1962లో కోట్నాక భీంరావు, 1967లో కోట్నాక భీంరావు, 1972లో కోట్నాక భీంరావు, 1978లో దాసరి నర్సయ్య వరుసగా ఆ పార్టీ నుంచి విజయం సాధించారు. తర్వాత తెలుగుదేశం ప్రభజనంలో ఇక్కడ 1983, 1985లో సీపీఐ తరఫున గుండా మల్లేశ్ రెండుసార్లు గెలుపొందారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థి దాసరి నర్సయ్య గెలుపొందగా.. మళ్లీ 1994లో సీపీఐ అభ్యర్థి గుండా మల్లేశ్ విజయం సాధించారు. 1999లో టీడీపీ అభ్యర్థి డాక్టర్ పాటి సుభద్ర, 2004లో ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపొందారు. 2014లో టీఆర్ఎస్ తరఫున కోవ లక్ష్మి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సక్కుపై విజయం సాధించారు. 2018లో ఆత్రం సక్కు కాంగ్రెస్ తరఫున గెలిచి టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితి

ప్రస్తుతం నియోజకవర్గంలో బీఆర్ఎస్ అధికారంలో ఉంది. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఆత్రం సక్కు అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి పోటీలో నిలవనున్నారు. కాంగ్రెస్ నుంచి రిటైర్డ్ ఆర్డీవో అజ్మీరా శ్యాంనాయక్, డాక్టర్ గణేష్ రాథోడ్, మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి టికెట్ ఆశిస్తున్నారు. బీజేపీ నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీరా ఆత్మారాం నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు కోట్నాక విజయ్‌లో ఒకరికి అవకాశం దక్కే అవకాశం ఉంది.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైందని, వారికి ఈవీఎం యంత్రాలపై పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సెక్టోరల్ అధికారులకు ప్రత్యేక ట్రైనర్లతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్లు, హ్యాండ్‌బుక్, పోలింగ్ కేంద్రాలపై అవగాహన ఉండాలన్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చడం, మాక్‌పోలింగ్ గురించి తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణకు వచ్చే సిబ్బందికి తగిన సూచనలు అందించాలన్నారు. ఎన్నికలకు ముందు రోజే సామగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపు చేపట్టాలన్నారు. తహసీల్దార్లు, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. రిజర్వు ఈవీఎంలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణు, మాస్టర్ ట్రైనర్లు, సెక్టోరల్ అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనం



జైనూర్, కెరమెరి మండలాల్లో బుధవారం దుర్గామాత, శారదామాతల నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. శోభాయాత్రలో మహిళలు, యువతుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. - వివరాలు 11లో▸

అప్పట్లో ఎన్నికల ఖర్చు పది వేలే..!

- అప్పటికీ ఇప్పటికీ ఎంతో మార్పు
- మాజీ ఎమ్మెల్యే అజ్మీరా గోవింద్‌నాయక్

దండేపల్లి: ''ఇప్పటి ఎన్నికల తీరు చూస్తుంటే పిచ్చెక్కిపోతుంది.. ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు కోట్లు గుమ్మరిస్తుండ్రు, దీంతో ఓటర్లు కూడా అలానే తయారయ్యారు. ఎవరు ఎంత ఇస్తుండ్రు అని చూస్తుండ్రు తప్పా అభిమానం అనేది పూర్తిగా కనుమరుగైందనే చెప్పొచ్చు. ఎన్నికల ప్రచారానికి లెక్క లేనంతగా ఖర్చు పెడుతుండ్రు. మా అప్పటి ఎన్నికల తీరుకు ఇప్పటి ఎన్నికల తీరుకు చాలా మార్పు వచ్చింది. 1985 ఎన్నికల్లో నేను రూ.10వేలు మాత్రమే ఖర్చు చేశాను..'' అని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా గోవింద్‌నాయక్ అన్నారు. అప్పటి, ఇప్పటి ఎన్నికల తీరుపై గోవింద్‌నాయక్ 'సాక్షి'తో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆయన మాటల్లోనే..

అభిమానంతో ఓటేసేవారు..

నేను మొట్టమొదటిసారి 1977లో ఖానాపూర్ నుంచి జనతా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేశాను. అప్పుడు ఎన్నికలపై ఎవరికీ పెద్దగా అవగాహన ఉండేది కాదు. ఆ సమయంలో నేను ఓడిపోయాను. రెండోసారి 1985లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందాను. అప్పుడు నేను ఎన్నికల కోసం ఖర్చు చేసింది రూ.10వేలు మాత్రమే. ఇదీ ఓటర్లకు పంచేందుకో, మరో దేనికో కాదు. గ్రామాల్లో తిరిగేందుకు ప్రయాణ ఖర్చులు, గోడలపై రాతలకు మాత్రమే. నేనే ద్విచక్ర వాహనంతో ఎక్కువగా పర్యటించేవాణ్ని. ఎందుకంటే గ్రామాలకు సరైన రోడ్డు మార్గాలు ఉండేవి కాదు. పెద్ద పెద్ద వాహనాలు లేవు. ఓటర్లు కూడా అభిమానంతో ఓటేసేవారు తప్పా నయా పైసా ఆశించేవారు కాదు.

1994లో రూ.లక్ష మాత్రమే..

రెండోసారి టీడీపీ నుంచి పోటీ చేశాను. అప్పుడు కూడా ఇప్పటితో పోల్చుకుంటే చాలా తక్కువే. కేవలం లక్ష రూపాయలు అయ్యింది. మేము కూడా జనం కోసం అలా పని చేసి ప్రజల్లో అభిమానాన్ని సంపాదించుకున్నాం. ప్రజలంతా కూడా మా పై ఉన్న అభిమానంతో మాకు ఓటేసి గెలిపించుకునేది. వారి కోసం మేము పనిచేసేది. నిత్యం ప్రజల మధ్య తిరిగేటోళ్లం. ఖానాపూర్ నియోజకవర్గం చిత్ర విచిత్రంగా ఉంటుంది. కొత్తగా ఏర్పడిన నాలుగు జిల్లాలకు విస్తరించింది. దీంతో ప్రచారం చేయడం అభ్యర్థులకు కష్టమే.



ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే గోవింద్‌నాయక్

2004లో రూ.10లక్షలకు పెరిగింది..

నేను మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేశాను. మొదట 1985 పోటీ చేసిన సమయంలో ప్రచార ఖర్చు రూ.10వేలు అయితే రెండోసారి 1994లో రూ.లక్ష, ఇక మూడోసారి 2004లో మాత్రం రూ.10లక్షల వరకు పెట్టాను. అంతే తప్పా ఇప్పటిలా కోట్లు ఖర్చు పెట్టలేదు.

పోలింగ్ ఏజెంట్‌కు రూ.10 మాత్రమే..

ఎన్నికల రోజున పోలింగ్ సమయంలో ఏజెంట్‌గా వ్యవహరించే వారికి రూ.10 ఇచ్చేది. అది నాకు బాగా గుర్తుంది. నేను రాజకీయంగా ప్రజల ఆదరాభిమానాలు పొందాను. అదే నాకు చాలా సంతోషం. ఇప్పటికీ నియోజకవర్గ ప్రజలు నన్ను మరిచిపోరు. అభిమానంతో నన్ను గెలిపించుకున్నారు. నేను కూడా ప్రజలకు అదే తీరుగా పనిచేశాను. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత కొందరు సంపాదించుకుంటారు. కానీ నేను అలాంటిదేమీ చేయలేదు. మా తాతలు, తండ్రుల నుంచి వచ్చిన కొన్ని ఆస్తులు అమ్మేశాను తప్పా కొనలేదు. వయస్సు పైబడడంతో ప్రస్తుతం స్వగ్రామం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్‌లో ఇంటి వద్ద ఉండి విశ్రాంతి తీసుకుంటున్నాను.

సినీ, టీవీ కళాకారులకు ఉచిత వర్క్‌షాప్

ఆసిఫాబాద్‌అర్బన్: నవజ్యోతి సాంస్కృతిక సంస్థ ఆసిఫాబాద్ ఆధ్వర్యంలో చలన చిత్ర, టీవీ రంగాల్లో స్థిరపడాలనుకునే ఔత్సాహికులైన కళాకారులు, రచయితలు, సాంకేతిక నిపుణులకు ఉచిత వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి సాయిని రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దండనాయకుల సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ ఉంటుందన్నారు. యువ దర్శకుడు మానస్ కూడా పాల్గొంటారని తెలిపారు. 98666 45822, 85550 86389, 94909 18014 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దసరా జోష్..!

- కలిసొచ్చిన ఎన్నికల సమయం
- జిల్లాలో రూ.6కోట్లకు పైగా మద్యం అమ్మకాలు
- ప్రత్యేక బస్సులతో ఆర్టీసీకి ఆదాయం

మద్యం అమ్మకాలు (14 నుంచి 24వ తేదీ వరకు)

లిక్కర్	7,561 కేసులు
బీర్లు	7,027 కేసులు
మొత్తం విలువ	రూ.6,18,79,560



ఆర్టీసీ ఆదాయం

తేదీ	ఆదాయం(రూ.లలో)
16న	15.61 లక్షలు
17న	16.94 లక్షలు
18న	13.27 లక్షలు
19న	15.30 లక్షలు
20న	13.99 లక్షలు
21న	17.12 లక్షలు
22న	14.91 లక్షలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల కావడం ఈసారి దసరా పండుగకు మరింత జోష్ వచ్చింది. వివిధ వ్యాపారాలు గతం కంటే జోరుగా సాగాయి. బతుకమ్మ పండుగ నుంచి ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లోని ప్రధాన మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడాయి. పెద్ద ఎత్తున మద్యం విక్రయాలు జరగడంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చింది. అలాగే హైదరాబాద్, కరీంనగర్ పట్టణాలకు ప్రత్యేక బస్సులు నడపడంతో ఆర్టీసీకి సైతం రోజువారీ ఆదాయం పెరిగింది.

జోరుగా మద్యం, మాంసం అమ్మకాలు

మద్యం అమ్మకాలకు దసరా పండుగ ఊపు తెచ్చింది. జిల్లావాసులు పండుగ సీజన్‌లో మొత్తం రూ.6,18,79,560 విలువైన మందు తాగారు. డిమాండ్‌ను ముందే ఊహించిన వైన్స్‌ల యజమానులు భారీగా స్టాక్ తెప్పించారు. ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు జిల్లాలోని మొత్తం 32 మద్యం దుకాణాల్లో విక్రయాలు జోరుగా సాగాయి. విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రధానంగా మద్యం, మాంసం విక్రయాలతోపాటు షాపింగ్ మాల్స్, ఎలక్ట్రానిక్స్ దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. అలాగే సద్దుల బతుకమ్మ రోజు చిరు వ్యాపారాలు సైతం జోరుగా సాగాయి. ఇక మాంసం విక్రయాలు సైతం పెద్దఎత్తున సాగాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం వందకు పైగా చికెన్, 30 వరకు మటన్ దుకాణాలు ఉన్నాయి. అయితే అనధికారికంగా వీటి సంఖ్య 150 వరకు ఉంటుంది. జిల్లాలో మొత్తంగా రూ.కోటికి పైగా వ్యాపారం జరిగినట్లు తెలుస్తోంది. ఆదివారం సద్దుల బతుకమ్మ తర్వాత కొందరు సోమవారం, మరికొందరు మంగళవారం పండుగ నిర్వహించడంతో రెండు రోజులపాటు మాంసం విక్రయాలు జరిగాయి.

ప్రయాణాల జోరు..

తెలంగాణలో బతుకమ్మ, దసరా పెద్ద పెండుగలు. దీంతో హైదరాబాద్, కరీంనగర్‌తోపాటు సమీపంలో ఉన్న మహారాష్ట్రలోని పట్టణాలకు పనుల నిమిత్తం వెళ్లిన వారు పండుగకు స్వగ్రామాలకు చేరుకుంటారు. ఏటా దసరా పండుగ ఆర్టీసీకి ఆదాయం తెచ్చిపెడుతోంది. జిల్లా కేంద్రంలోని ఏకైక బస్సు డిపో ఉంది. ఆసిఫాబాద్ నుంచే కాగజ్‌నగర్, మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్ వంటి పట్టణాలకు అధికారులు బస్సులు నడుపుతారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 16 తేదీ నుంచి 22 వరకు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడిపారు. సాధారణ రోజుల్లో డిపో నుంచి ప్రతిరోజూ బస్సులు 30 వేల కిలోమీటర్లు తిరిగితే సుమారు రూ.12 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. పండుగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ వివిధ రూట్లలో 48 వేల కిలోమీటర్ల సర్వీసులను తిప్పారు. ప్రతిరోజూ ఒక్క హైదరాబాద్ నగరానికే ఐదు ప్రత్యేక బస్సులను నడిపారు. వారం రోజుల్లో హైదరాబాద్ నుంచి రాకపోకల సౌకర్యం కోసం 78 ట్రిప్పులు తిప్పినట్లు డిపో అధికారులు వెల్లడించారు. పండుగ రోజులను సద్వినియోగం చేసుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో డిపోలో పనిచేస్తున్న సిబ్బంది, అధికారుల సమన్వయంతో ప్రయాణికులకు సేవలందించామని, డిపోకు అనుకున్న రీతిలో ఆదాయం సమకూరిందని డీఎం శ్రీధర్ 'సాక్షి'కి తెలిపారు.

అభద్రతాభావాన్ని తొలగించేందుకే కవాతు

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రజల్లో అభద్రతా భావాన్ని తొలగించేందుకే కేంద్ర, పారా మిలటరీ బలగాల కవాతు నిర్వహిస్తున్నామని డీఎస్పీ వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గంగాపూర్ కమాన్ నుంచి ప్రధాన రహదారి గుండా బుధవారం కేంద్ర, పారా మిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలపై ప్రజల్లో ఉన్న అభద్రతా భావాన్ని తొలగించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో కవాతు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. నాయకులు ఇచ్చే తాయిలాలకు ఆశపడి విలువైన ఓటును అమ్ముకోవద్దని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమని, నచ్చిన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు, అనుమానితులు తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే అసాంఘిక కార్యక్రమాలు జరిగిన వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కేంద్ర, పారా మిలటరీ బలగాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెబ్బెన సీఐ నరేందర్, ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



కవాతులో పాల్గొన్న డీఎస్పీ వెంకటరమణ, పక్కన సీఐ నరేందర్

క్లుప్తంగా

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం, నిందితుడితో పోలీసులు

కాగజ్‌నగర్‌టౌన్: రైలు మార్గం ద్వారా అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో బుధవారం ఢిల్లీ నుంచి వైజాగ్ వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ రైలు (20806)లో జీఆర్పీఎఫ్, ఆర్పీఎల్, టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించగా బగాడి రమణమూర్తి అనే వ్యక్తి వద్ద 52 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో ఆసిఫాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఎక్సైజ్ సీఐ మంగమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

చెన్నూర్: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో గల మాధవి మద్యం షాపులో చోరీ జరిగింది. దుకాణం యజమాని రమేశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన వారు దుకాణం తెరిచి ఉండడాన్ని గమనించి సమాచారం అందించారు. రమేశ్‌రెడ్డి వచ్చి షాపులోకి వెళ్లి సీసీ కెమెరాను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి గడ్డపారతో షట్టర్‌ను పైకి లేపి లోనికి ప్రవేశించినట్లు గుర్తించాడు. రూ.7 వేల నగదు, రూ.5 వేల విలువైన మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బెల్ట్‌షాప్‌పై దాడి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ రాంనగర్ బస్తీలోని ఓ బెల్ట్‌షాప్‌పై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ తెలిపారు. లక్ష్మీ ప్రసన్న అనే మహిళ తన ఇంటి వద్ద బెల్ట్ షాప్ నిర్వహిస్తుండగా దాడి చేసి 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఈమేరకు నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గంజాయి స్వాధీనం

బెల్లంపల్లి: బెల్లంపల్లి కన్నాలబస్తీలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. బస్తీలోని రైల్వేఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బెడ్డల వంశీకృష్ణ అనే యువకుడు గంజాయి సేవిస్తూ కనిపించాడు. పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించగా పట్టుకుని అతని వద్ద 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బల్లార్షా నుంచి గంజాయి తీసుకుని వచ్చి అధికధరకు విక్రయించడమే కాకుండా తానుకూడా సేవిస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి

సిర్పూర్(టి): మండలంలోని పారిగాం గ్రామ సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి చెందింది. ఎస్సై డీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ మండలం అందెల్లి గ్రామానికి చెందిన అంగుల శిరీష (23) మంచిర్యాల నుంచి కౌటాల మండలం సైదాపూర్ గ్రామానికి ఆటోలో బయలుదేరింది. పారిగాం సమీపంలోకి రాగానే ఆటో బోల్తా పడడంతో శిరీషకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మృతురాలికి ఆర్నెళ్ల క్రితం వివాహం కాగా ప్రస్తుతం మూడు నెలల గర్భిణి. మృతురాలి భర్త అంగుల మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడ్ ఏం చెబుతోంది..

- ప్రజల మధ్య విద్వేషాలు పెంచేలా వ్యవహరించొద్దు
- కులమతాల పేరుతో ఓట్లు అడుగొద్దు
- ఆలయాలు, మసీదులు, చర్చీల్లో ప్రచారానికి నో..
- ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలకు తావివ్వొద్దు
- ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

మంచిర్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల కమిషన్ ఎలక్షన్ నియమావళి విడుదల చేసింది. ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే స్థానిక ఎన్నికల పరిశీలకులను కలిసి లేదా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. లేదా సీ–విజిల్ యాప్ ద్వారా ఉల్లంఘనులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీసి నేరుగా ఎన్నికల సంఘానికి, ప్రత్యేక అధికారికి పంపించవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల సంకలనాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) కార్యాలయం నుంచి విడుదల చేశారు. అందులోని ముఖ్యాంశాలు.



కోడ్ నియమావళి

- భిన్న, కుల, మత, భాష వర్గాల ప్రజల మధ్య విభేదాలు పెంపొందించే, ఉద్రిక్తతలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదు.
- ప్రత్యర్థి పార్టీలపై చేసే విమర్శలు కేవలం ఆ పార్టీ విధానాలు, కార్యక్రమాలు, గత చరిత్ర చేసిన పనులకు పరిమితమై ఉండాలి.
- వ్యక్తిగత విమర్శలు చేయకూడదు. ధ్రువీకరణ జరుగని ఆరోపణలు, వక్రీకరణల ఆధారంగా విమర్శలు చేయరాదు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, వ్యక్తిగత విమర్శలు చేస్తూ పోస్ట్ చేయరాదు.
- ఎన్నికల చట్టాల్లో నేరపూరిత చర్యలుగా పేర్కొన్న కార్యకలాపాలకు దూరంగా ఉండాలి. ప్రధానంగా ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేయకూడదు.
- ఆధారాల్లేకుండా రూ.50 వేలకు మించి నగదు ఒకచోటి నుంచి మరో చోటికి తరలించకూడదు.
- ఓటరు స్థానంలో ఇతరులతో ఓటు వేయించడం, పోలింగ్ కేంద్రాలకు వందమీటర్ల దూరంలో ప్రచారం నిర్వహించడం, పోలింగ్‌కు 48 గంటల ముందు సభలు సమావేశాలు జరపడం, ఓటర్లను పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పించడం వంటివి చేయరాదు.
- ప్రతీ పౌరుడు తన ఇంట్లో ప్రశాంతంగా బతికేందుకు తమహక్కును గౌరవించాలి. వ్యక్తుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా వారి ఇళ్లముందు నిరసనలు, ప్రదర్శనలు, ఆందోళనలు చేపట్టరాదు.
- యజమానుల అనుమతి లేకుండా వారి స్థలాలు, భవనాలు, ప్రహరీ గోడలకు జెండాలు, బ్యానర్లు కట్టడం, పోస్టర్లు అంటించడం, వాల్‌రైటింగ్ లాంటివి చేయరాదు.
- ఇతర పార్టీల సమావేశాలు, ఊరేగింపులకు తమ మద్దతుదారులు భంగం కలిగించకుండా చూసుకోవాలి. ఏదైనా ఒక పార్టీ కార్యకర్తలు వేరే పార్టీల సమావేశం జరుగుతున్న ప్రాంతం మీదుగా ఊరేగింపులు నిర్వహించకూడదు. ఒకపార్టీ అతికించిన పోస్టర్లను మరోపార్టీకి చెందిన కార్యకర్తలు తొలగించకూడదు.
- ఊరేగింపుల రూట్‌మ్యాప్‌ను నిర్వాహకులు ముందుగా స్థానిక పోలీసులకు తెలియజేయాలి. ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చూసుకోవాలి. ఇద్దరు లేదా అంతకు మించి అభ్యర్థులు లేదా పార్టీలు ఏకకాలంలో ఒకేరూట్‌లో ఊరేగింపు నిర్వహించే సమయంలో నిర్వాహకులు ముందుగా సంప్రదింపులు జరుపుకుని ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలి.
- ఊరేగింపులో తీసుకెళ్లే వస్తువుల విషయంలో పార్టీల అభ్యర్థులు నియంత్రణ పాటించాలి. అవి అసాంఘికశక్తుల చేతిలో దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇతర పార్టీల నేతల దిష్టిబొమ్మలను ఊరేగించడం, బహిరంగంగా దహనం చేయడం వంటివి చేయరాదు.
- ఓటర్లు మినహా ఇతరులు పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించేందుకు అనుమతి ఉండదు. కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన పాస్ కలిగిన వారికి మినహాయింపు ఉంటుంది.
- శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతిపాదిత సభ సమయం, వేదికను ముందస్తుగా స్థానిక పోలీసులకు తెలియజేయాలి. సభ ఉన్న ప్రాంతంలో నిషేధాజ్ఞలు అమలులో ఉంటే వాటిని కచ్చితంగా పాటించాలి. అవసరమైతే ముందుగానే దరఖాస్తు చేసుకుని సడలింపులు పొందాలి. సభలో లౌడ్ స్పీకర్, ఇతర సదుపాయాలను వినియోగించడానికి ముందు సంబంధిత అధికారి నుంచి అనుమతి పొందాలి.
- అభ్యర్థుల స్పీచ్‌లు ఓటు వేసేలా ఉండకూడదు.
- స్వేచ్ఛగా ఓటు వేసేలా ఎన్నికల అధికారులు సహకరించాలి.
- ఓటర్లకు పంపిణీ చేసే చిట్టీలపై గుర్తులు, పార్టీల పేర్లు ఉండరాదు.
- పోలింగ్‌కు 48 గంటలకు ముందు నుంచి మద్యం పంపిణీ చేయరాదు.
- పోలింగ్ బూత్ వద్ద పార్టీలు, అభ్యర్థులు ఏర్పాటు చేసే క్యాంపుల వద్ద పోస్టర్లు, జెండాలు, గుర్తులు ఇతర ప్రచార సామగ్రి ప్రదర్శించరాదు. ఆహార పదార్థాలు పంపిణీ చేయరాదు.
- పోలింగ్ రోజు వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉంటాయి. పర్మిట్లు పొందిన వాహనాలకు స్టిక్కర్లు బాగా కానిపించే విధంగా అతికించాలి. ఎన్నికల నియమావళిని ఎవరు ఉల్లంఘించినా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసే హక్కు ప్రతీ భారతీయ పౌరునికి ఉంది.

కార్మిక క్షేత్రం.. బెల్లంపల్లి

- చారిత్రాత్మకత కలిగిన నియోజకవర్గం
- 2009లో ఏర్పాటు



గుండా మల్లేశ్



దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి నియోజకవర్గ ఓటర్లు	
మొత్తం ఓటర్లు	1,69,598
పురుషులు	84,790
మహిళలు	84,796
ఇతరులు	12

బెల్లంపల్లి: బెల్లంపల్లికి ఎంతో చారిత్రాత్మకత ఉంది. సింగరేణి చరిత్రలో ఇల్లెందు తర్వాత బొగ్గు గనుల పుట్టుక బెల్లంపల్లిలో జరిగింది. కార్మిక క్షేత్రమైన ఈప్రాంతం కమ్యూనిస్టులకు నెలవుగా, విప్లవోద్యమాల పురిటి గడ్డగా ప్రసిద్ధిగాంచింది. ప్రాణహిత నది ఈ నియోజకవర్గం మీదుగానే ప్రవహిస్తుండటం విశేషం. పాత ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో బెల్లంపల్లి ప్రధాన పట్టణంగా బాసిల్లింది. నియోజకవర్గాల పునర్విభజనలో ఆసిఫాబాద్ నుంచి వేరుపడి బెల్లంపల్లి ప్రత్యేక అసెంబ్లీ నియోజకవర్గంగా అవతరించింది.

ఎన్నో విశిష్టతలు

బొగ్గు నిక్షేపాలు కలిగిన ఈప్రాంతం రాక్షస బల్లులు (డైనోసార్లు) నడయాడిన నేలగా చరిత్ర కెక్కింది. తాండూర్ కోల్ మైన్స్ పేరుతో 1926లో బెల్లంపల్లిలో బొగ్గు తవ్వకాలు ప్రారంభించారు. కీకారణ్యంగా ఉన్న ఈ ప్రాంతంలో «మార్గన్స్ పిట్» అనే పేరుతో తొలి బొగ్గు గని ఏర్పాటైంది. మార్గన్స్ అనే ఓ ఆంగ్లేయ అధికారి పేరును గనికి పెట్టినట్లుగా తెలుస్తోంది. ఈ అసెంబ్లీ నియోజకవర్గం మీదుగా ప్రాణహిత నది ప్రవహిస్తోంది. ప్రాణహిత పరీవాహక ప్రాంతాన్ని ఆనుకుని దట్టమైన అటవీ సంపద ఉంది. ఆ అటవీ ప్రాంతంలో రాక్షస బల్లులు సంచారం చేసినట్లు రూఢీ అయింది. మూడు దశాబ్దాల క్రితం వేమనపల్లి మండలంలో రాక్షస బల్లుల అవశేషాలు బయట పడ్డాయి. వాటిని కొంతమంది గుట్టుగా తరలిస్తుండగా పట్టుకుని హైదరాబాద్ సాలార్‌జంగ్ మ్యూజియంలో భద్రపరిచారు. తాండూర్ ప్రాంతంలో సిరామిక్స్ పరిశ్రమలు ఉన్నాయి. గోండు రాజుల కోట అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేస్తుంటుంది. అచ్చులాపూర్‌లో ఉన్న వేద పాఠశాల ఆధ్యాత్మికంగా విరాజిల్లుతోంది. దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ ఈ నియోజకవర్గంలో ఉండటం మరో విశేషంగా చెప్పవచ్చు. నెన్నెల మండలంలోని కుశ్నపల్లి గ్రామం టస్సర్ బట్టల చేనేత కేంద్రంగా ప్రత్యేకతను చాటుకుంటోంది. విప్లవోద్యమాలకు, ప్రజా పోరాటాలకు బెల్లంపల్లి పురిటి గడ్డగా ఖ్యాతి గడించింది. ఇలా ఎన్నో విశిష్టతల కలబోతగా బెల్లంపల్లి అలరారుతోంది.

నియోజకవర్గ కూర్పు

ఆసిఫాబాద్ నుంచి విడిపోయి ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడిన బెల్లంపల్లిలో చెన్నూర్, లక్సెట్టిపేట నియోజకవర్గాల పరిధిలో ఉన్న మూడు మండలాలను విలీనం చేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఉన్న వేమనపల్లి, నెన్నెల, లక్సెట్టిపేట నియోజకవర్గంలో ఉన్న కాసిపేట మండలాన్ని కూర్చుచేసి బెల్లంపల్లి, తాండూర్, భీమిని, కన్నెపల్లి మండలాలతో బెల్లంపల్లి నియోజకవర్గం ఏర్పడింది.

నియోజకవర్గ ముఖ చిత్రం...


2009లో ఏర్పాటైన ఈ నియోజవర్గానికి ఇప్పటి వరకు 3 సార్లు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం నాలుగోసారి జనరల్ ఎన్నికలకు బెల్లంపల్లి నియోజకవర్గం సిద్ధమైంది. ఈ నియోజకవర్గాన్ని ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వు చేశారు. తొలిసారిగా 2009లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి గుండా మల్లేశ్ ఎమ్మెల్యేగా ఎన్నికై శాసన సభలో సీపీఐ పక్ష నేతగా పనిచేశారు. ఆ తర్వాత 2014లో రెండో విడతగా జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) అభ్యర్థి దుర్గం చిన్నయ్య విజయం సాధించారు. ఆ తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లోనూ దుర్గం చిన్నయ్య రెండోసారి గెలిచి పట్టు నిలుపుకున్నారు.

ప్రస్తుత రాజకీయ పరిస్థితులు

అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ(యూ), బీజేపీ, ఇతర రాజకీయ పక్షాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. నిర్మాణపరంగా బీఆర్ఎస్ క్షేత్రస్థాయి నుంచి పట్టుకలిగి ఉండగా కాంగ్రెస్‌పార్టీ కూడా బలంగానే ఉంది. సీపీఐ నేత గుండా మల్లేశ్ మృతి చెందిన తర్వాత సీపీఐ పట్టు సన్నగిల్లినా కొంతకాలం నుంచి మళ్లీ ఆ పార్టీ పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా గ్రామాలకు విస్తరించింది. సీపీఎం, ఎంసీపీఐ, బీఎస్పీ, వైఎస్సార్‌సీపీ, వైఎస్సార్‌టీపీ, తదితర పక్షాలు పని చేస్తున్నాయి. సమస్యలపై స్పందిస్తున్నాయి. ఎస్సీలు అత్యధిక జనాభా కలిగి ఉన్న ఈ నియోజకవర్గంలో నేతకాని, మాల, మాదిగ కులస్తుల సంఖ్య అధికంగా ఉంది. బీసీలు, ముస్లింల సంఖ్య ప్రాధాన్యత క్రమంలో ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

పెర్కపెల్లిలో క్షుద్రపూజల కలకలం

తిర్యాణి: మండలంలోని నాయకపుగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని పెర్కపెల్లిలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కపెల్లి గ్రామానికి చెందిన మంచెర్ల లక్ష్మి తన కుమారుడితో కలిసి ఉంటోంది. బుధవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు తన ఇంటి ఎదుట రంగు బియ్యం, నిమ్మకాయలతో పాటు పిండితో తయారు చేసిన రెండు బొమ్మలు, అగర్‌వత్తులు పెట్టడాన్ని గమనించి వెంటనే తన కుమారుడిని పిలిచింది. అప్పటికే ఆ వ్యక్తి పారిపోయినట్లుగా ఆమె తెలిపింది. అయితే గతంలో ఇదే గ్రామంలో పలువురు రైతుల ఇంటి ఎదుట



ఇంటి ఎదుట రంగు బియ్యం, నిమ్మకాయలు

ఇలాంటి సంఘటనలు జరుగడంతో గ్రామస్తుల్లో భయాందోళన మొదలైంది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు లక్ష్మి తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



శ్రీ సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో 2002–03 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులు వెంకటరమణ, వెంకటకృష్ణ, ఛాయారాణి, రాజశేఖర్, సూరి చెప్పిన పాఠాలను గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల తరువాత కలుసుకున్న వారంతా నాటి మధుర క్షణాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుధీర్, వెంకటేశ్, నాగార్జున, రాజేందర్, రవీందర్, వెంకటస్వామి, అవంతి, సౌమ్య, సువర్ణ, సౌజన్య, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

నగదు స్వాధీనం



జైనథ్: సీజ్ చేసిన నగదుతో పోలీసులు

కోటపల్లి: మండలంలోని లక్ష్మీపూర్ ప్రాణహిత నది వద్ద మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద రూ.2లక్షల నగదు పట్టుబడడంతో పోలీసులు సీజ్ చేశారు. మహదేవ్‌పూర్ నుంచి ప్రాణహిత వంతెన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు మీదుగా లక్ష్మీపూర్ వైపు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

బెల్లంపల్లిలో రూ.3 లక్షలు..

బెల్లంపల్లి: పట్టణంలోని కాంటాచౌరస్తా వద్ద బుధవారం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.3లక్షల నగదు పట్టుబడినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. బెల్లంపల్లి మండలం బుధాకుర్దు గ్రామానికి చెందిన బియ్యాల సత్తయ్య వద్ద రూ.3 లక్షలు లభించాయని, నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నగదును ఎన్నికల ఎఫ్ఎస్‌టీ టీమ్ అధికారులకు అప్పగించగా సీజ్ చేసినట్లు తెలిపారు.

కాగజ్‌నగర్‌లో రూ.94వేలు..

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని వినయ్ గార్డెన్ ప్రధాన రహదారిపై బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.94వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ ఎస్‌హెచ్‌వో బి.స్వామి, ఎస్సై అంజయ్య తెలిపారు. కాగజ్‌నగర్ నుంచి మహారాష్ట్ర వెళ్తున్న సోనూను తనిఖీ చేయగా సరైన పత్రాలు లేకుండా నగదు లభించిందని వారు పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ప్రతినిధి రఘునందన్‌కు నగదును అప్పగించినట్లు తెలిపారు.

రూ.1.40లక్షలు సీజ్

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద పత్రాలు లేకుండా నగదును తరలిస్తున్న వ్యక్తి నుంచి రూ.1.40లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌కు చెందిన ఆకాశ్ బద్రినాథ్ రాథోడ్ తన కారులో మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేయగా రూ.1.40లక్షలు లభించాయి. సదరు వ్యక్తి డబ్బులు తరలించేందుకు సరైన పత్రాలు సమర్పించకపోవడంతో నగదును సీజ్ చేశారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన భీమనవేణి నారాయణ(65) ఉరేసుకుని బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గోవింద్ తెలిపారు. నారాయణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

మందమర్రిలో అమ్మవారి రాతి విగ్రహం లభ్యం



అమ్మవారి రాతి విగ్రహం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణం పాత బస్టాండ్ సమీపంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో గల బతుకమ్మ ఘాట్ వద్ద సోమవారం రాత్రి అమ్మవారి రాతి విగ్రహం లభ్యమైంది. నల్ల పోచమ్మ అమ్మవారని నల్లగొండ రమేశ్ (దేవుడు చెప్పే వ్యక్తి) చెప్పడంతో వెలిసిన చోటే నెలకొల్పి భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. రమేశ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దసరా పర్వదినం (సోమవారం) రోజున రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో కాలనీలోని కూడలి వద్ద ఏర్పాటు చేసిన జమ్మిచెట్టు వద్ద గుమ్మడి కాయ బలి కొట్టే సమయంలో రమేశ్‌కు దేవుడు పూనకమై ఇక్కడికి సమీపంలోనే అమ్మవారు కొలువై ఉన్నారని, మొక్కులు చెల్లించండని చెప్పాడు. అమ్మవారు ఎక్కడున్నారు? చూపిస్తే తప్పకుండా కొలుస్తామని కాలనీవాసులు చెప్పడంతో సుమారు 50 మీటర్ల దూరం తీసుకెళ్లి అక్కడ స్థలంలో అరమీటరు లోతులో విగ్రహం ఉందని చెప్పాడు. వెంటనే అట్టి స్థలంలో తవ్వడంతో అమ్మవారి విగ్రహం బయటపడింది. వెంటనే సమీపంలోనే (బతుకమ్మ ఘాట్ ఆవరణలో) ఉన్న ఊర పోచమ్మ, మదన పోచమ్మ విగ్రహాల పక్కన ఉంచారు. ఈ విషయం మంగళవారం అందరికీ తెలియడంతో కాలనీ వాసులు భక్తితో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

గతంలో అక్కడ పుట్ట ఉండేది



అమ్మవారి విగ్రహం లభించిన చోట గతంలో పెద్ద పుట్ట ఉండేది. మూడు నెలల క్రితం బతుకమ్మ ఘాట్ పేరిట పుట్టను తవ్వి మట్టి పక్కనే పోశారు. ఆ మట్టిలోనే అమ్మవారి విగ్రహం లభించింది. అమ్మవారికి గుడి కట్టేందుకు సహాయ సహకారాలు అందించాలని కాలనీవాసుల తరఫున కోరుతున్నాం.

– ఎనగందుల లక్ష్మి, ఎస్సీ, ఎస్టీ కాలనీవాసి

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

భీమిని(బెల్లంపల్లి): గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన కన్నేపల్లి మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కన్నేపల్లి మండలం జనకపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లారం గ్రామానికి చెందిన సంద్రా భీమయ్య భార్య వెంకటమ్మ బుధవారం ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీక్ కావడంతో భయాందోళనకు గురై బయటకు పరుగులు తీసింది. ఒక్కసారిగా పెద్దగా శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. పెంకుటిళ్లు కావడంతో మంటలు పెద్ద ఎత్తున అంటుకున్నాయి. ఘటనలో ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధం కావడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కాగా ఘటన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. స్థానికులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. బెల్లంపల్లి నుంచి ఫైరింజన్ వచ్చేలోగానే 90 శాతం మేర ఇల్లు పూర్తిగా కాలి పోయింది. ఈ ప్రమాదంలో వంట సామగ్రి, ధాన్యం, నగదు, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. జరిగిన ఆస్తినష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ ప్రసాద్‌రావ్, డీటీ గోర్ధన్‌సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్‌రావు

'కాళేశ్వరం'పై సీబీఐతో విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న ఎంపీ గుణ

మందమర్రిరూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూ.లక్ష కోట్ల నిధులు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ రెండేళ్లకే పిల్లర్లు కుంగిపోయాయని, దీనిపై సీబీఐచే విచారణ జరిపించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంపీ గుణ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాణ్యతా లోపం వల్ల పిల్లర్లు కుంగిపోయాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం వలన రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. దీనికి బాధ్యుడైన ముఖ్యమంత్రిపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి రాజేశ్, నాయకులు సందీప్‌రెడ్డి, రమేశ్, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హమాలివాడ ఏరియాలో అండర్ బ్రిడ్జి వద్ద చాయ్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ ఎస్సై ఏ.రాజేందర్ తెలిపారు. మృతునికి సుమారు 65 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఒంటిపై తెల్లని గీతల షర్టు, లుంగీ కట్టుకుని ఉన్నాడని, వారం రోజుల నుంచి అదే ప్రాంతంలో భిక్షాటన చేస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

జ్వరంతో చిన్నారి మృతి

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో జ్వరంతో చిన్నారి మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకొంది. వివరాల ప్రకారం... ఈదపు మహేందర్, లావణ్య దంపతుల కుమార్తె ధనశ్రీ(4) నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. మంగళవారం జ్వరంతో పాటు ఫిట్స్ రావడంతో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది.

మట్కా నిర్వాహకుల అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) బైపాస్ సమీపంలో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని సీసీఎస్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీసీఎస్ సీఐ సాయినాథ్ మాట్లాడుతూ చాందా (టి) బైపాస్ సమీపంలో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడం ఆదిలాబాద్ రూరల్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు కలిసి దాడి నిర్వహించారు. అశోక్, ఫిరోజ్ ఖాన్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.20,200, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.